క్లుప్తంగా

18న 'చలో రైల్ నిలయం'



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కార్మికులు

జనగామ రూరల్: జనగామ స్టేషన్‌లోని రైల్వే కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన తలపెట్టిన చలో రైల్ నిలయం ముట్టడిని విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జనగామ రైల్వేస్టేషన్‌లో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ చైర్మన్ తిరుపతిరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో సమస్యలు ఉండటంతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జనగామ సెక్రటరీ దేవరాజు ఏలేందర్, శ్రీశైలం, నక్క తిరుపతి, మద్దూరి రమేశ్, యూత్ కన్వీనర్ జోగు భాస్కర్, రమేశ్, మహేశ్, స్టేషన్ మాస్టర్ సుధన్షు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



నరేందర్, వెంకన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి

దేవరుప్పుల: టాటా ఏస్ మ్యాజిక్ వాహన యజమానుల యూనియన్ మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చింత నరేందర్(కామారెడ్డిగూడెం), పంగ వెంకన్న (ధర్మగడ్డతండా) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల విభాగం ప్రతినిధి రెడ్డిరాజుల ఎల్లప్ప శనివారం తెలిపారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా మామిడి సైదులుతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పసుపులేటి సోమన్న, బస్వ భాస్కర్, జోగు నవీన్, మాజీ ఉపాధ్యక్షుడు శిరవేరి సంపత్, బానోతు జితేందర్, ఈదునూరి అనిల్, దుద్దుల భాస్కర్,మంద సంతోష్ తదితరులు హాజరయ్యారు. ఆర్టీసీ బస్సులో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యంతో కోల్పోతున్న ఉపాధికి ప్రత్యామ్నాయ ఆదాయ కల్పన కోసం మార్గాన్వేషణలు వెతుక్కుంటూ ప్రభుత్వ తోడ్పాటు కోసం కమిటీలు పాటుపడాలని ప్రతినబూనారు.

మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మహేశ్



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆకుల మహేశ్ మున్నూరు కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మహేశ్ మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం బలోపేతానికి, ఐక్యతకు కృషి చేస్తానన్నారు. వెనుకబడిన మున్నూరు కాపు కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తన నియమానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి వీరమల్ల రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



జనగామ: కొద్ది రోజులుగా వెన్ను నొప్పితో బాధపడుతూ హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్ తదితరులు ఉన్నారు.

హరీశ్‌రావును కలిసిన మనోజ్‌రెడ్డి



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

బియ్యం సాయం

పాలకుర్తి: లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన తుడి నాగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు 25 కిలోల బియ్యం, రూ.1,000 సాయం అందించారు. ప్రముఖ వ్యాపారవేత్త కదుదుల మానస నిరంజన్ రెడ్డి పెళ్లిరోజును పురస్కరించుకుని అందించారని ట్రస్టు సభ్యులు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, కార్యదర్శి జీడి హరీశ్, ఒర్రె కుమారస్వామి, చిలకాని భాస్కర్, మధు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- మహాశివరాత్రి జాతరకు సోమేశ్వరాలయంలో ముమ్మర ఏర్పాట్లు

పాలకుర్తి టౌన్: మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 25 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనాతో ఏర్పాట్లకు సంబంధించిన ఆదేశాలు అధికారులు జారీ చేయడంతో పనుల్లో వేగం పెరిగింది. ఇప్పటికే కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో పాలకుర్తి సోమేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లకు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తగిన సూచనలు చేసిన విషయం విదితమే.

ఏర్పాటు ఇలా...

సోమేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం జరిగే మండపం వద్ద భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్ల ఏర్పాటు చేపట్టారు. ఆంజనేయ స్వామి ఆలయం, స్వాగత ఆర్చి, ఆలయ గోపురాలకు రంగులు వేసే పనులు కొనసాగుతున్నాయి.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు..

ఆలయంలో జాతర జరిగే ప్రాంతంలో అవసరమైన అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు ప్రారంభించారు. రహదారుల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు ప్రారంభించినట్లు శాఖ ఏఈ రణధీర్ తెలిపారు.



ఆలయంలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

ఏర్పాట్లు చేస్తున్నాం



ఈనెల 25 నుంచి జరిగే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. జాతరకు వచ్చే భక్తులు తాగునీరు, చలువ పందిళ్లు, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నాం. వివిధ శాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేపట్టాం. మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలి.

- సల్వాది మోహన్‌బాబు, ఈఓ

24 గంటలు అన్ని సౌకర్యాలు..

జాతర జరిగే రోజుల్లో 24 గంటల పాటు భక్తులకు తాగునీరు తదితర అవసరాలకు సరఫరా చేసేలా మిషన్ భగీరథ అధికారలు తగిన చర్యలు చేపడుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 24 గంటల పాటు 130 మంది పారిశుద్ధ్య కార్మికులతో దేవాలయ ప్రాంగణం, జాతర పరిసర ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యల చేపట్టనున్నారు.



అంజనేయస్వామి ఆలయానికి రంగులు వేస్తున్న పేయింటర్



అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

వాహనాల పార్కింగ్‌కు..

జాతర జరిగే సమయంలో వాహనాల పార్కింగ్ కోసం స్థానిక సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు నాలుగు చోట్ల వాహనాల పార్కింగ్‌కు స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. జాతర విజయవతం చేసేలా అన్ని శాఖల సమన్వయం కోసం ఆధికారులు తగి చర్యలు చేపడుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

- ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి

దేవరుప్పుల : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చందన మండల సమాఖ్య కార్యాలయంలో సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం వినియోగంపై గ్రామైఖ్య సంఘ ప్రతినిధులు, వీఓఏల ముగింపు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పూర్వపు మాదిరి సూర్యోదయం నుంచి అస్తమించే వరకూ శారీరక శ్రమ, తమ పరిసరాల్లో లభించే పౌష్టికాహారం సమన్వయంతో తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారన్నారు. ప్రతి కుటుంబ అభ్యున్నతి మహిళల చేతిలో ఉందని, ఇందుకు ఆరోగ్యం, పౌష్టికాహారం, పరిసరాల పరిశుభ్రత, కౌమార దశ బాలికల నుంచి మహిళలకు కనీస ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ విద్య, ఆర్థిక అంశాల్లో అవగాహన తప్పనిసరన్నారు. ఆర్థికాభివృద్ధి చెందుతున్న మహిళలు తమ కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలవకుండా చూడాలన్నారు. నాలుగు రోజులు శిక్షణ పొందిన ప్రతినిధులు, వీఓఏలు తమతమ స్వయం సహాయక సంఘాలకు తోడ్పాటు అందించాలన్నారు. సదస్సులో సమాఖ్య అధ్యక్షురాలు నల్ల ఉమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి, ఐకెపి సీసీలు వసంత, ఉమ, సోమనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకట్‌రెడ్డి

ఎమ్మెల్సీగా సరోత్తంరెడ్డిని గెలిపించండి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రామ్మోహన్‌రెడ్డి

దేవరుప్పుల/పాలకుర్తి టౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగ అపరిష్కృత సమస్యలతోపాటు తెలంగాణ సాధన ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన, బీజేపీ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం దేవరుప్పుల, పాలకుర్తి మండలాల్లోని పలు పాఠశాలల్లో నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సరోత్తంరెడ్డిని గెలిపించాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పెద్దగొని రాజు, చింత సృజన్‌కుమార్, భాగాల నవీన్ రెడ్డి కాసాని సత్తయ్య, రాజోజు నర్సింహాచారీ, మారం రవికుమార్, దొంగరి మహేందర్, దుంపల సంపత్, వేలుప్పల దేవరాజు, పెనుగోండ సోమేశ్వర్, ఈర్ల రాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



దేవరుప్పుల: కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు రాజమౌళిగౌడ్, శశిధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సరోత్తంరెడ్డిని గెలిపించాలని వారు ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వారకల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చిల్పూరు: మండలంలోని చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం భక్త జన సందోహం మధ్య గోవింద నామస్మరణలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా స్వామివారి వారకల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గనగోని రమేశ్, బుచ్చయ్య, రత్నాకర్‌రెడ్డి, వెంకటరమణాదేవి, రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ మోహన్, వీరన్న, మల్లికార్జున్, మహేశ్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్-భార్గవి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.

జీపీ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయిస్తున్న ఎంపీఓ మధుసూదన్

సాక్షి ఎఫెక్ట్..

చిల్పూరు: నష్కల్ గ్రామ సమీపంలోని లెజెండ్ డెవలప్‌మెంట్‌లో ఉన్న ఎకరం భూమిలో శనివారం ఎంపీఓ మధుసూదన్ సిబ్బందితో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. 'జీపీ భూమిలో వరి సాగు చేసిన కాంగ్రెస్ నాయకుడు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి ఎంపీఓ స్పందించారు. ఆయన గ్రామానికి వెళ్లి లెజెండ్ డెవలప్‌మెంట్ వారితో చర్చించి సిబ్బందితో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ జీపీకి చెందిన భూముల్లో ఎవరైనా అక్రమంగా సాగు చేసినా, ఆక్రమించుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రఘునాథపల్లి: నిడిగొండ వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ శనివారం తెలిపారు. తెల్లవారు జామున వాగులో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో వెంటనే వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ గువ్వల నర్సయ్య, యజమాని మాల రాజులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్సై హెచ్చరించారు.

సీఆర్‌పీలకు నివాళి

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెదక్ జిల్లా చేగుంట మండల సీఆర్‌పీలు రమేశ్, శ్రీనివాస్‌ల చిత్రపటానికి శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద మండల సమగ్ర శిక్షా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీసీఆర్‌పీఏ జిల్లా అధ్యక్షుడు యెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులు విధుల్లో ప్రాణాలు కోల్పోతే, కనీసం దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ఏపీలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలు, దహన సంస్కారాలకు రూ.25 వేలు అందజేస్తుండగా, తెలంగాణలో ఎలాంటి ఆర్థిక భరోసా లేక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భరోసాగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ సమ్మయ్య, కంప్యూటర్ ఆపరేటర్ రమాదేవి, ఐఈఆర్‌పీ మల్లికార్జున్‌తోపాటు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హిమ్మత్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరి ప్రజలను ఐక్యం చేసేది బొడ్రాయి పండుగ అని అన్నారు. త్వరలో గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కులాల పెద్దలు, భక్తులు, పాల్గొన్నారు.



బొడ్రాయి వద్ద నాయకులతో ఎమ్మెల్యే శ్రీహరి

స్వయంపరిపాలన దినోత్సవం



స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కాగా, విద్యాబోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌రెడ్డి, నిరజారెడ్డి, సుధాకర్, శ్రవణ్‌కుమార్, విద్యార్థులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

జనగామ రూరల్: పెంబర్తి గ్రామంలోని ఏకాంబరేశ్వర మమ్మాయమ్మ దేవాలయం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు శనివారం చండీ హోమం, లలిత సహస్ర నామ పారాయనం చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన చేసి ప్రార్థించారు. అలాగే ఆదివారం శివపార్వతుల కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందాలని కోరారు.

చేయూత



సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన నిరుపేద అంధుడు మారోజు భీష్మాచారి కూమార్తె సృజన వివాహానికి శనివారం మండల స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సభ్యులు రూ.13,116 చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీపాద ఉప్పలాచారి, స్వర్ణకారుల సంఘం పట్టన అధ్యక్షుడు ముత్తోజు రాజు, శ్రీపాద శ్రీరాములు, పెండోట రవీంద్రచారి, రామగిరి నాగరాజు, రాజేంద్రచారి, విష్ణుమూర్తి, నంగునూరి సత్యం, కడార్ల భానచందర్, సోమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

సాక్షి నెట్‌వర్క్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా బంజారా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. భోగ్‌బండారో కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ధర్మ స్థాపన, బంజారాల అభివృద్ధికి పాటుపడిన సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కాగా, పలు గ్రామాల్లో బంజారా మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



జనగామ రూరల్: పట్టణంలో..



తరిగొప్పుల: భోజ్యాతండాలో..



నర్మెట: పూజ చేస్తున్న బంజారా సంఘాల నాయకులు



రఘునాథపల్లి: పొట్టిగుబ్బడితండాలో సేవాలాల్, తుల్జాభవానికి పూజ చేస్తున్న సంఘం నాయకులు



జనగామ రూరల్: గ్రెయిన్ మార్కెట్ వద్ద..



దేవరుప్పుల: ధరావత్‌తండాలో..

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం



విరాళం అందజేస్తున్న బేజాడి సిద్దులు

బచ్చన్నపేట: కొన్నె గ్రామంలో దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు తమ్మడపల్లి గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బేజాడి సిద్దులు రూ.22 వేల విరాళం అందజేసినట్లు విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు ఎంటి శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్ఠాపనకు దాదలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్)కు చెందిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపా మండల అధ్యక్షుడు గట్టు మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి గోపా ప్రత్యేక చొరవతో పనిచేస్తుందన్నారు. గౌడ కులస్తులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో చైతన్యం కావాలన్నారు. సంఘం నాయకులు అనీల్, ప్రశాంత్, చంద్రమౌళి, వంగ సదానందం, గట్టు రమేష్, ఉప్పలయ్య, పులి శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్‌ఐసీ చెక్కు అందజేత

నర్మెట: వెల్దండకు చెందిన గూటం నర్సయ్య ఎల్‌ఐసీ జీవన్ ఉమంగ్ రూ. 2 లక్షల పాలసీ తీసుకుని ఏడాది ప్రీమియం చెల్లించిన ఆరు మాసాలకు గుండెపోటుతో మృతిచెందారు. కాగా, సంస్థ ప్రతినిధులు రూ. 2,09,600 విలువ చేసే చెక్కును బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ జనగామ బ్రాంచి ఎస్‌బీఎం హరిలాల్, ఏబీఎం దునిలాల్, డీఓ మధు, ఏజెంట్ పిట్టల నరేశ్, మాజీ సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వంగ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎస్‌బీఎం హరిలాల్